క్లుప్తంగా

నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు వరం



వనపర్తి రూరల్: నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు వరంలాగా మారిందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. సోమవారం పెబ్బేర్ పట్టణంలోని 9వ వార్డులో ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంజూరైన లబ్ధిదారులు త్వరగా నిర్మిస్తే బిల్లులు జాప్యం లేకుండా జమవుతాయన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సత్యనారాయణ, రామన్‌గౌడ్, మున్సిపాలిటీ మేనేజర్ గణేష్, వార్డు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడికి ఘన సన్మానం

పాన్‌గల్: బీజేపీ రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా నియమితులైన రామచందర్‌రావుని బీజేపీ కొల్లాపూర్ నియోజకవర్గ నాయకుడు ఎల్లేని సుధాకర్‌రావు ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లో మండల బీజేపీ నాయకులు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అసెంబ్లీ కో కన్వీనర్ అన్వేష్, మండల పార్టీ అధ్యక్షుడు శివరాం యాదవ్, పుట్టనాగరాజు, డిష్‌కుర్మయ్య, ప్రవీణ్ తదిరులు పాల్గొన్నారు.

యూరియా కొరత సృష్టిస్తే చర్యలు

పాన్‌గల్: యూరియా కొరత సృష్టిస్తే వారిపై చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి రాజవర్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయం, బుసిరెడ్డిపల్లిలో అగ్రో దుకాణాన్ని తనిఖీచేసి యూరియా నిల్వలను ఆయన పరిశీలించారు. సింగిల్‌విండో కార్యాలయానికి ఇప్పటి వరకు 310 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందని, కార్యాలయంలో 162 మెట్రిక్ టన్నుల అందుబాటులో ఉందని తెలిపారు. రైతులకు ఎలాంటి కొరత లేకుండా యూరియాను సరఫరా చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా యూరియా నిల్వల రికార్డులను ఆయన పరిశీలించారు.

'అన్నదానం.. మహాదానం'

వనపర్తిటౌన్: అన్ని దానములకెల్లా అన్నదానం, విద్యాదానం ప్రధానమైందని ఆర్యవైశ్య సంఘం నాయకుడు నగేష్, కృష్ణమూర్తి, గిరిబాబు, విశ్వనాథం అన్నారు. జోగులాంబ ఆర్యవైశ్య నిత్యాన్నదాన సత్రం వైస్‌చైర్మన్‌గా ఎంపికైన వనపర్తి పట్టణానికి చెందిన మారం బాలీశ్వరయ్యను సోమవారం పట్టణ ఆర్యవైశ్య సంఘం నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా బాలీశ్వరయ్య మాట్లాడుతూ.. దైనందిన జీవితంలో సేవాదృక్పథం కలిగిన కార్యక్రమాల్లో పాల్గొనడం ఎంతో తృప్తికరమన్నారు. భక్తులకు ఆకలి తీర్చేందుకు సంఘం కృషి చేస్తుందన్నారు.

మందకృష్ణతోనే సమన్యాయం

అమరచింత: ఎమ్మార్పీఎస్ వ్యవస్థపాక అధ్యక్షుడు మందకృష్ణతోనే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సమన్యాయం జరుగుతున్నదని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు అరుణ్‌కుమార్ అన్నారు. మందకృష్ణ జన్మదినం సందర్భంగా కేట్ కటింగ్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాసన్న, ప్రకాష్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో బంగారు పతకం



ఖిల్లాఘనపురం: వరంగల్ జిల్లా హన్మకొండలో ఆదివారం రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించారు. 12 ఏళ్ల బాలుర పరుగుపందెంలో మండలంలోని అప్పారెడ్డిపల్లి గ్రామానికి చెందిన సాయిసాత్విక్ 60 మీటర్ల పరుగు పందెంలో పాల్గొని, ప్రథమస్థానంలో నిలిచి బంగారుపతకం సాధించాడు. ఈ సందర్భంగా సాత్విక్‌ను కోచ్ దేవేందర్, గ్రామ మాజీసర్పంచ్ కృష్ణవేణి తదితరులు అభినందించారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యకర జీవితం

అమరచింత: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ ఇంట్లోని తడి, పొడిచెత్తను చెత్తబండ్లలో వేయాలని మున్సిపల్ కమిషనర్ నాగరాజు అన్నారు. వందరోజుల ప్రణాళికలో భాగంగా పట్టణంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం డంపింగ్‌యార్డును సందర్శించి తడి,పొడి చెత్తలను వేరు చేసి ఆదాయ మార్గం వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో వార్డు అధికారులు, మెప్మా సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

గాడి తప్పిన ప్రత్యేక పాలన..

- చెత్తాచెదారం, మురుగు ఎక్కడికక్కడే
- అస్తవ్యస్తంగా డ్రెయినేజీలు..
- రోగాలబారిన ప్రజలు
- వ్యర్థాలతో పరమేశ్వరుడి చెరువు కలుషితం



ఆత్మకూర్‌లో పరమేశ్వరస్వామి చెరువువద్ద వ్యర్థాలు, చెత్తాచెదారం, కట్టపై కోళ్ల వ్యర్థాలు

ఆత్మకూర్: పురపాలికల్లో ప్రత్యేకాధికారుల పాలన గాడి తప్పుతోంది.. ఎటుచూసిన చెత్త చెదారం.. అస్తవ్యస్తమైన డ్రైనేజీలు కంపు కొడుతున్న కాలనీలు.. దోమల దండయాత్రతో మున్సిపాలిటీల ప్రజలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. జిల్లాలోని వనపర్తి, కొత్తకోట, ఆత్మకూర్, పెబ్బేరు, అమరచింత మున్సిపాలిటీల్లో సమస్యలు తాండవిస్తున్నాయి. పాలకమండలి పాలన ముగిసిన అనంతరం ప్రత్యేకాధికారుల పాలనలో సమస్యలు తీరక ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. మున్సిపాలిటీ కేంద్రాల్లో దోమలు వ్యాప్తి పెరిగింది. ప్రత్యేకాధికారుల పాలన గాడితప్పిందని, సమస్యలపై దృష్టి సారించడం లేదని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వార్డుల్లో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడంతో మురుగు నివాసాల ఎదుట చేరుతుంది. దుర్వాసన వెదజల్లడంతోపాటు విపరీతంగా దోమలు వ్యాప్తి చెంది స్థానికులు రోగాల బారిన పడుతున్నారు. పలుమార్లు డ్రైనేజీలు నిర్మిస్తామని చెప్పిన నేటికీ కార్యాచరణ చేపట్టకపోవడంతో విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా డ్రైనేజీలు నిర్మించాలని, దోమలు వ్యాప్తిచెందకుండా ఫాగింగ్ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

వ్యర్థాలతో పరమేశ్వరుడి చెరువు..

ఆత్మకూర్ పరమేశ్వరస్వామి చెరువు కలుషితమై చెత్తచెదారంతో, దుర్వాసన వెదజల్లుతుండడంతో స్థానికులు ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రత్యేకాధికారుల పాలన అస్తవ్యస్తంగా మారిందని ఇందుకు పరమేశ్వరస్వామి చెరువే నిదర్శమని పట్టణ వాసులు మండిపడుతున్నారు. చెరువులో సగానికిపైగా నీరు తగ్గడంతో కొసు వాసనతో ప్రయాణికులు బెంబేలెత్తుతున్నారు, దీనికితోడు స్థానికులు, చికెన్, మటన్ వ్యాపారస్తులు వ్యర్థాలన్నీ ఇక్కడే పారబోస్తుండడంతో కంపుతో, దుర్వాసనతో కలుషితమైన నానా అవస్థలు పడుతున్నట్లు ప్రజలు వాపోతున్నారు. మున్సిపల్ అధికారులు ఇప్పటికైనా స్పందించి వ్యర్థాలు చెరువును సంరక్షించాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.



ఆత్మకూర్‌లోని శివాజీనగర్‌లో పందుల స్వైరవిహారం



ఆత్మకూర్‌లోని నేతాజీనగర్‌లో డ్రైనేజీ దుస్థితి

ఇబ్బంది పడుతున్నాం..



డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది దోమలతో సావాసం చెయ్యలేకపోతున్నాం. దుర్వాసన భరించలేకున్నాం. కాలనీ వాసులు నిత్యం రోగాల బారిన పడుతున్నారు. పురపాలకమండలి అధికారులు ఈ విషయంపై దృష్టిసారించి ఫాగింగ్ చేపట్టి, డ్రైనేజీలను నిర్మించాలి.

– గాయత్రి, గృహిణి, శివాజీనగర్

దుర్వాసన భరించలేకున్నాం...



పరమేశ్వరస్వామి చెరువులో మత్స్యకారులకు చేపలపెంపకంతోపాటు ఆయకట్టు రైతులకు సాగునీరు అందుతుంది. కొంతమంది వ్యర్థాలు, వేస్తుండడంతో దుర్వాసన వెదజల్లడంతోపాటు నీళ్ల కలుషితమవుతున్నాయి. ఇప్పటికైన అధికారులు, జిల్లా కలెక్టర్ దృష్టి సారించాలి.

–బాలు, వివేకానంద సేవాసమితి అధ్యక్షుడు

త్వరలోనే పరిష్కారం..



ఆత్మకూర్‌లో చాలా సమస్యలు తీరుతున్నాయి. డ్రైనేజీ వ్యవస్థ ఒక్కొక్కటిగా చక్కబెడుతున్నాం. సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే డ్రైనేజీల నిర్మాణాలను చేపడుతాం. దోమలువ్యాప్తి చెందకుండా ఇదివరకే ఫాగింగ్ చేపడుతున్నాం.

–శేఖర్, కమిషనర్, మున్సిపాలిటీ ఆత్మకూర్

పరిశుభ్రంగా ఉంటే వ్యాధులు దరి చేరవు



షాపు యజమానికి జరిమానా వేస్తున్న అధికారి

వనపర్తిటౌన్: ప్రజలు ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అప్పుడే డెంగీ, మలేరియా, సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఉంటారని మున్సిపల్ కమిషనర్ ఎస్.వెంకటేశ్వర్లు సూచించారు. శనివారం జిల్లా కేంద్రంలోని పలువార్డుల్లో 100 రోజుల కార్యాచరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నిల్వనీటిని ఎప్పటికప్పుడు శుభ్ర పర్చుకోవాలని, లేదంటే అనారోగ్యం బారిన పడతారని చెప్పారు. పట్టణంలో ఆయా వార్డుల్లో సీజనల్ వ్యాధులు, డెంగీ, మలేరియాపై అవగాహన, తడి, పొడి వ్యర్థాల విభజన, పెంపుడు, వీధి కుక్కలపై ఏబీసీ ప్రచారాన్ని నిర్వహించామన్నారు. కొత్త ఎస్‌హెచ్‌జీ ఏర్పాటు, స్ట్రీట్‌వెండర్స్ అవేర్‌నెస్, అకౌంట్ ఓపెనింగ్స్, భువన్ సర్వే, ట్రేడ్‌లైసెన్స్ రెసిడెన్షియల్ టూ కమర్షియల్ కన్వర్ట్, డ్రైనేజీల్లోని మురుగును తీయించి శుభ్రం చేయించినట్లు ఆయన తెలిపారు. వీధికుక్కల వీరంగం ఎక్కువవుతున్న సమయంలో ప్రజలు బెంబేలెత్తకుండా వాటిని పట్టుకుంటున్నట్లు చెప్పారు. అదేవిధంగా పట్టణంలోని పలు కిరాణా దుకాణాలను తనిఖీ చేశారు. ఓ షాపులో ప్లాస్టిక్ దొరకడంతో రూ.2,500 జరిమానా విధించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉమా మహేశ్వర్‌రెడ్డి, డీఎంసీ బాలరాజు, సూపర్‌వైజర్, వార్డు అధికారులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్య, ఉపాధికి ప్రభుత్వం పెద్దపీట



సైన్స్‌ల్యాబ్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

గోపాల్‌పేట: కాంగ్రెస్ ప్రభుత్వం విద్య, ఉపాధికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా కృషి చేస్తోందని ఎమ్మెల్యే మేఘారెడ్డి అన్నారు. సోమవారం ఆయన ఉమ్మడి మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా గోపాల్‌పేట మండలంలోని బుద్దారం గురుకుల పాఠశాలలో రూ.13.50 లక్షలతో నిర్మించిన సైన్స్ ల్యాబ్‌ను ప్రారంభించారు. అంతకుముందు బుద్దారం గండి ఆంజనేయస్వామి ఆలయంలో మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం రేవల్లి మండలంలోని నాగపూర్ గ్రామంలో రూ.22లక్షలు, రేవల్లిలో రూ.38 లక్షలతో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ రఘు, తహసీల్దార్ లక్ష్మీదేవి, ఎంపీడీఓ నరసింహా, సత్యశీలారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మొహర్రం



వనపర్తిలో పీర్లకు పూజలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

వనపర్తి టౌన్: జిల్లా కేంద్రంలో పీర్లపండుగ ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు సోమవారం పీర్ల బీఆర్ఎస్ నాయకులు పూజలు చేసి నిమజ్జనంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా కన్వీనర్ అశోక్, యూత్ అధ్యక్షుడు సూర్యవంశం గిరి, మాజీ మార్కెట్ డైరెక్టర్ యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

పాన్‌గల్: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో సోమవారం మొహర్రం వేడుకలు ఘనంగా నిర్వహించారు. పీర్లను పురవీధుల గుండా ఊరేగింపు చేసి నిమజ్జనానికి తరలించారు. చివరిరోజు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి పీర్లకు దట్టీలు, పూలు సమర్పించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఊరేగింపులో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఆత్మకూర్: మండలంలో గత పదిరోజులు కొలువుదీరిన ఆలంలు అల్‌విదా అంటూ బయలుదేరాయి. మొహర్రం వేడుకలు సోమవారం రాత్రి ఘనంగా ముగిసాయి. పట్టణంతోపాటు, పిన్నంచర్ల, ఆరేపల్లి, రేచింతల, తుంపల్లి, కత్తేపల్లి, వీరరాఘవపురం, ఖానాపూర్ తదితర గ్రామాల్లో మొహర్రం నిర్వహించారు. అనంతరం మాలిజ, షర్బత్ నైవేద్యంగా సమర్పించారు.

మదనాపురం: మొహర్రం వేడుకలను సోమవారం మండల ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దుప్పల్లి, అజ్జకొల్లు, కొన్నూరు, నర్సింగాపురం, తదితర గ్రామాల్లో సోమవారం పీర్ల పండుగను హిందూ, ముస్లిం సోదరులు వైభవంగా జరుపుకొన్నారు. ఆయా గ్రామాల్లోని పురవీధుల్లో పీర్లను ఊరేగించారు. పీర్లకు పూలు, ఊదు, బెల్లం, దట్టీలు మలిజ ముద్దలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఊరేగింపులతో పాటు పీర్ల మజీద్ వద్ద డప్పు చప్పుళ్ల యువకులు పాటలు పాడుతూ అలయ్ బలయ్ ఆడారు.

జీఓ నంబర్ 282ను వెనక్కి తీసుకోవాలి



నిరసన తెలుపుతున్న కార్మికసంఘాల నాయకులు

వనపర్తి రూరల్: కార్మికులకు వ్యతిరేకంగా ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెంబర్ 282 ప్రతులను సీఐటీయూ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో దహనం చేశారు. ఈ సందర్భంగా సీఐటీ యూ జిల్లా కార్యదర్శి పుట్టా ఆంజనేయులు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మోష మాట్లాడారు. ఈనెల 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు కార్మికులు సిద్ధమవుతున్న తరుణంలో జీఓ 282ను విడుదల చేయడం సరైంది కాదన్నారు. ఈ సందర్భంగా సమ్మెలో కార్మికులు అధికసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

సమ్మెను విజయవంతం చేయాలి

పాన్‌గల్: కార్మికుల హక్కుల సాధన కోసం ఈనెల 9న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు సాయిలీల సోమవారం ఓ ప్రకటనలో కోరారు. సమ్మెలో ఐద్వా మహిళ సంఘాల సభ్యులు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆమె పేర్కొన్నారు.

సమ్మె పోస్టర్లు విడుదల

ఆత్మకూర్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 9న దేశవ్యాప్త సమ్మెలో కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు రాజు, టీయూసీఐ జిల్లాఅధ్యక్షుడు ప్రసాద్ అన్నారు. సోమవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో నాయకులు, కార్మికులతో కలిసి సమావేశం నిర్వహించి సమ్మె పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు భారతీయుడు, వెంకటన్న, రాములు, భగవంతు ఉన్నారు.

గురుపౌర్ణమిన శ్రీకృష్ణుడిని పూజించాలి

ఖిల్లాఘనపురం: ఈ నెల 10న గురుపౌర్ణమి రోజున శ్రీకృష్ణుడిని పూజించడం వలన మంచి జరుగుతుందని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞానవేదిక అధ్యక్షుడు రాఘవేంద్ర ఆచారి అన్నారు. సోమవారం మండలం మాల్యాపురం గ్రామంలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సమితి సభ్యులు రవి, సుదర్శన్, పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

కొత్తకోట రూరల్: పట్టణం కేంద్రంలోని అంబేద్కర్ కాలనీకి చెందిన రాజానందం(50) సోమవారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రాజానందం భౌతికాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి అంత్యక్రియలకు ఆర్థికసా యం అందజేశారు.

కాంగ్రెస్‌తోనే కలలు సాకారం

ఆత్మకూర్: అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరవుతున్నాయని కాంగ్రెస్ నాయకులు రహెమతుల్లా, శ్రీనివాస్ అన్నారు. సోమవారం పట్టణంలోని ఇందిరమ్మ ఇళ్ల భూమి పూజలో పాల్గొన్నారు. కార్యక్రమంలో నాయకులు దామోదర్, అశోక్, బుచ్చన్న ఉన్నారు.

వైద్యకార్మికుల సమస్యలను పరిష్కరించాలి



ఆత్మకూర్: ప్రభుత్వ ఆసుపత్రుల్లో విధులు నిర్వహిస్తున్న వైద్యకార్మికుల సమస్యలను పరిష్కరించాలని, పెండింగ్ వేతనాలను చెల్లించాలని ఏఐటీయూసీ రాష్ట్రకార్యదర్శి సురేష్ అన్నారు. సోమవారం స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో వైద్య కార్మికులతో కలిసి నిరసన తెలిపారు. ఏళ్లతరబడి కనీస వేతనాలకు నోచుకోక వెట్టిచాకిరి చేస్తున్నారన్నారు. 9న జరిగే సమ్మెలో పాల్గొనాలని నోటీసును వైద్యాధికారి హర్షవర్ధన్‌రెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమంలో సత్తార్, బాలరాజు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు



ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు



గోప్లాపూర్‌లో..

సాక్షి, నెట్‌వర్క్: ఎమ్మార్పీఎస్ ఆవిర్భవించిందని, 30 ఏళ్లుగా మందకృష్ణ మాదిగ అలుపెరగని పోరాటాలు చేసి ఎన్నో విజయాలను సాధించామని రాష్ట్ర కార్యదర్శి అజ్జపాగ లక్ష్మణ్ అన్నారు. సోమవారం ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మందకృష్ణ జన్మదిన పురస్కరించుకొని కేక్ కట్ చేశారు.

❖ ఆత్మకూర్ పట్టణంలో ఎమ్మార్పీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి అజ్జపాగ లక్ష్మణ్, మండల అధ్యక్షుడు దండు శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు కిషోర్ ఆధ్వర్యంలో కళాశాల ఎదురుగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలతో పాటు మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు డాక్టర్ శ్రీధర్‌గౌడ్, బంగారు శ్రీనివాసులు, విండో అధ్యక్షుడు లక్ష్మీకాంత్‌రెడ్డి, రవికుమార్, రహ్మతుల్లా పాల్గొన్నారు.

❖ మదనాపురం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరించడంతో పాటు మందకృష్ణ మాదిగ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వేమన్న పాల్గొన్నారు.

❖ పాన్‌గల్ మండల కేంద్రంతో గోప్లాపూర్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి, ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో లక్ష్మయ్య, నాగరాజు పాల్గొన్నారు.

❖ కొత్తకోట పట్టణంలో నాయకులు ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరించడంతో పాటు మందకృష్ణ మాదిగ పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో ఇజ్రాయిల్, గాడీల ప్రశాంత్, అయ్యన్న, సంపత్‌కుమార్ ఉన్నారు.

❖ మందకృష్ణ మాదిగ పుట్టినరోజు సందర్భంగా వనపర్తి అఖిలపక్ష ఐక్యవేదిక నాయకులు ఆయనను సికింద్రాబాద్‌లోని ఎమ్మార్పీఎస్ కేంద్ర కార్యాలయంలో కలిసి పూలమాల, శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అఖిలపక్ష ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు సతీష్‌యాదవ్, విజయ్, చరణ్, కృష్ణయ్య, నాగరాజు, శ్రీను తదితరులు ఉన్నారు.

కేఎల్ఐ డీ-1 కాల్వకు మరమ్మతు చేపట్టాలి



డీఈకి వినతిపత్రం అందజేస్తున్న గిరిజన రైతులు

పాన్‌గల్: మండలంలోని తెల్లరాళ్లపల్లితండాలోని కేఎల్ఐ డీ-1 కాల్వ పరిధిని నిర్ధారించి మరమ్మతులు చేయాలని సోమవారం తండా ఆయకట్టు రైతులు ఇరిగేషన్ డీఈ వెంకటరమణదేవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి బాల్యానాయక్, రైతులు మాట్లాడుతూ.. కాల్వ మరమ్మతులకు జిల్లా అధికారులను అడిగితే మా పరిధిలో లేదని, నాగర్‌కర్నూల్ జిల్లా అధికారులను అడిగితే మా పరిధిలో లేదని చెబుతూ దాట వేస్తున్నారు. దీంతో కాల్వ మరమ్మతులు చేయకపోవడంతో చివరి ఆయకట్టు రైతులకు సక్రమంగా సాగునీరందక ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. జిల్లా అధికారులు ఒకరిపై ఒకరు నెట్టుకుంటుడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కాల్వ ఏ జిల్లా పరిధిలోకి వస్తుందో నిర్ధారించి మరమ్మతులు చేయాలని, లేనియెడల రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఫిర్యాదును పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని అధికారులు పేర్కొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం



ప్రచారంలో బీఆర్ఎస్ నాయకులు

వనపర్తి రూరల్: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరుగ్యారంటీల అమలులో విఫలమైందని బీఆర్ఎస్ నాయకుడు మాజీ మున్సిపల్ చైర్మన్ కరుణ శ్రీసాయినాథ్, మాజీ వైస్ చైర్మన్ మేకల కర్రెస్వామి అన్నారు. సోమవారం పెబ్బేర్ పట్టణంలో ఒకటో వార్డులోని కర్రెమ్మగుడి వద్ద పూజలు చేసి స్థానిక ఎన్నికల ప్రచారాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆదేశాలతో ప్రచారాన్ని ప్రారంభించినట్లు పేర్కొన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలు హామీలను అమలు చేయకుండా ప్రజలకు మోసం చేస్తుందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ చేస్తున్న మోసాలు ప్రజలకు ఇంటింటికి వివరిస్తున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు చిన్న ఎల్లారెడ్డి, శేఖర్‌గౌడ్, వేణు, బీచుపల్లి సంతోష్, సాయిరెడ్డి, యాదగిరి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిపేరు మీద మొక్కలు నాటండి

వనపర్తి రూరల్: పీఎం నరేంద్రమోదీ పిలుపుమేరకు వన సంరక్షణలో భాగంగా తల్లి పే రు మీద ప్రతిఒక్కరూ మొక్క లు నాటి సంరక్షించాలని జిల్లా బీజేపీ కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి వెంకట్రాంరెడ్డి అన్నారు. సోమవారం పెబ్బేర్ మండలం కంచిరావుపల్లితండాలో తల మాతృమూర్తి పేరు మీద మొక్కలను నాటారు. కార్యక్రమంలో పార్టీ మండల ఉపాధ్యక్షుడు భాస్కర్‌నాయక్, శివనాయక్, లక్ష్మణ్‌నాయక్ పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యాలపై దృష్టి సారించండి

పాన్‌గల్: ఉపాధ్యాయులు విద్యార్థుల సామర్థ్యాల పెంపుపై దృష్టి సారించాలని ఎంఈఓ శ్రీనివాసులు హెచ్ఎంలకు సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలల్లో ఆయా పాఠశాలల హెచ్ఎంల సమావేశంలో ఆయన మాట్లాడారు. అందరికృషితో మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడం అభినందనీయమన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

ఖిల్లాఘనపురం: విద్యార్థుల సమస్యల పరిష్కారానికి నూతన కమిటీ పనిచేయాలని తెలంగాణ సామాజిక విద్యార్థి సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి రమేశ్, ప్రధాన కార్యదర్శి బెస్త యాదగిరి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో సంఘం మండల కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు శివ, ఉపాధ్యక్షుడు పుష్ప, కార్యదర్శి సాయి, శ్రీలత, శిరీషను అభినందించారు.